క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీలకు జి.వేమవరం విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఐ.పోలవరం: ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా పెదవేగిలో జరిగిన 62వ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ పోటీల్లో జి.వేమవరం జెడ్పీ పాఠశాల విద్యార్థి పాలిపు పండు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సలాది వెంకట నారాయణ్ తెలిపారు. విద్యార్థికి శిక్షణనిచ్చిన పీఈటీ అడ్డగళ్ల నాగరమ ప్రసాద్‌ను పాఠశాల తల్లితండ్రుల కమిటీ చైర్మన్ మెండ బుల్లియ్య, సర్పంచ్ నల్లా సుదర్శన్, మెండా వెంకన్నబాబు తదితరులు అభినందించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

అమలాపురం టౌన్: తనపై దాడి చేసి గాయపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక 27వ వార్డుకు చెందిన గోపాలదాసు రమణ అనే మహిళ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఫిర్యాదు చేసింది. తన ఇంటి ముందు నుంచి పందులను తోలుకెళుతున్నప్పుడు సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తున్నానని అయిదుగురు వ్యక్తులు వచ్చి కర్రతో దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వారం రోజులైనా బాధ్యులపై చర్యలు తీసుకోకపోగా, తిరిగి తన కుటుంబసభ్యులపై కేసు నమోదుచేశారని ఆమె కలెక్టర్‌కు తెలిపింది.

జాతీయ పోటీలకు యానాం క్రీడాకారుల ఎంపిక



జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన యానాం క్రీడాకారులు

యానాం: బీహార్‌లోని పాట్నాలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించే 18వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు యానాం నుంచి 8 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు సోమవారం అథ్లెటిక్స్ కోచ్‌లు పి.శేఖర్, చింతా వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు సంగాడి విజయరాజు, కొపనాతి మణికంఠ, మట్టపర్తి తేజస్విని షణ్మిత, పినిపే వినియ్‌పాల్, కడలి హారిక, దవులూరి జాషువా, పినపోతు కనకమహాలక్ష్మి, ఒగ్గు నాగస్వాతిశ్రీల బృందం పోటీల్లో పాల్గొననుందన్నారు.

నేటి నుంచి మన్నా మహోత్సవాలు

అమలాపురం టౌన్: అమలాపురం మిరియాం గ్రౌండ్స్‌లో ఈ నెల 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు మన్నా ఫుల్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మన్నా మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి కార్ల్ డేవిడ్ కొమానపల్లి(లాల్) తెలిపారు. మన్నా మినిస్ట్రీస్ ఫౌండర్స్ బిషప్ సుదర్శన్ జ్యోతి కొమానపల్లి, బిషప్ పి.స్పర్జన్‌రాజ్ తదితరులు పాల్గొని దైవ వర్తమానాలు అందిస్తారన్నారు.

మా నివాసాల్ని డంపింగ్‌యార్డ్‌గా మార్చొద్దు

అమలాపురం రూరల్: కామనగరువు పంచాయతీ మెట్ల సత్యనారాయణరావు కాలనీలో నివాసాల మధ్యలో పాఠశాల, కమ్యూనిటీ హాల్‌కు కేటాయించిన స్థలంలో వ్యర్థాలను తెచ్చి డంపింగ్ యార్డ్‌గా మార్చడంపై కాలనీవాసులు సోమవారం కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. వైరస్ బారిన పడి చనిపోయిన పందుల కళేబరాలను తెచ్చి పారేయడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని యలమంచిలి బాలకృష్ణ, భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేటి ఈశ్వర్‌గౌడ్ తెలిపారు.

ఎస్‌ఐ కనకారావుకు పుదుచ్చేరి బదిలీ

యానాం: యానాం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ బడుగు కనకారావును పుదుచ్చేరి పీఏపీకి బదిలీ చేస్తూ సోమవారం పుదుచ్చేరి సూపరిండెంట్ ఆఫ్ పోలీస్(హెడ్‌క్వార్టర్స్) సుభమ్ గోష్ ఉత్తర్వులిచ్చారు. నూతన ఎస్‌ఐని నియమించే వరకూ కోస్టల్ స్టేషన్ ఎస్‌ఐ శేరు నూకరాజుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలిచ్చారు. బదిలీల్లో పుదుచ్చేరివ్యాప్తంగా ఆరుగురు ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది.

అరుదైన గౌరవంపై నాయీ బ్రాహ్మణుల హర్షం

తాళ్లరేవు: ప్రభుత్వ గుర్తింపు పొందిన దేవాలయాల్లోని పాలకమండలిలో సభ్యులుగా తప్పనిసరిగా ఒక నాయీ బ్రాహ్మణుడికి అవకాశం కల్పించడంపై నాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశ చరిత్రలోనే నాయీ బ్రాహ్మణ కులానికి సీఎం జగన్ అరుదైన గౌరవం కల్పించారని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కాపవరపు శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని సీఎం జగన్ ఒక మెట్టు ఎక్కించారని, జాతి మొత్తం ఆయనకు రుణపడి ఉంటుందన్నారు.

విపక్షాల మట్టి దందా



వానపల్లిపాలెంలో అనధికారంగా జరుగుతున్న మట్టి తవ్వకాలు



ఎస్.యానాంలో తీరాన్ని ఆనుకొని జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు

- అనుమతులు లేకుండా ఆక్వా చెరువుల్లో మట్టి తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ఉప్పలగుప్తం: తెర ముందు అధికార పార్టీ నాయకులను విమర్శిస్తూ తెర వెనుక జనసేన, టీడీపీ నాయకులు మట్టి దందా సాగిస్తున్నారు. మండలంలో గత కొన్ని రోజులుగా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు, అక్రమ రవాణా కొనసాగుతోంది. ప్రధానంగా ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే ఆక్వా చెరువుల వద్ద తవ్వకాలు జరిపి ట్రాక్టర్, లారీలతో రవాణా చేస్తున్నారు. పైగా అక్రమ తవ్వకాలపై అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు.

ఉప్పలగుప్తం మండలంలోని ఎస్.యానాం, వానపల్లిపాలెం, ఎన్.కొత్తపల్లి గ్రామాల్లో ఈ అక్రమ మట్టి దందా జోరుగా సాగుతుంది. అమలాపురానికి చెందిన ఓ జనసేన నాయకుడు ఎస్.యానం శివారు ప్రాంతం నుంచి నిత్యం పదుల సంఖ్యలో లారీల్లో లేఅవుట్లకు మట్టిని తరలిస్తున్నారు. వానపల్లిపాలెంలో ఇళ్ల మధ్య నుంచే ట్రాక్టర్లు అధిక సంఖ్యలో తిరుగుతున్నా అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్.కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాల పక్క నుంచే అక్రమ రవాణా సాగుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల ఎన్.కొత్తపల్లి గ్రామంలో ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. ఇలా ఇళ్లు, పాఠశాలల మధ్య నుంచి ట్రాక్టర్లు అధిక స్పీడుతో వెళుతుండడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా అక్రమ రవాణా చేస్తున్న వాహనాలకు మైనర్ డ్రైవర్‌లను నియమించుకోవడంపై స్థానికంగా చర్చ సాగుతోంది. మట్టి, ఇసుక అక్రమ రవాణాలు రెవెన్యూ, మైన్స్, పోలీస్ అధికారుల కనుసన్నల్లోనే సాగుతున్నాయని, అందుకే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> **అనధికార తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> ఉప్పలగుప్తం మండలంలో ఎటువంటి మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. అనధికారంగా చెరువులు తవ్వుతున్నా, మట్టిని రవాణా చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> – ఎం.వెంకటరమణ, ఆర్‌ఐ, ఉప్పలగుప్తం

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కోలా గంగాభవాని
- రూ.22.86 కోట్లతో వార్షిక అంచనా బడ్జెట్ ఆమోదం



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోలా గంగాభవాని

ముమ్మిడివరం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ కోలా గంగాభవాని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పార్టీలకతీతంగా గ్రామస్థాయిలో ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరువ చేయాలన్నారు. సమావేశంలో అయినాపురం గ్రామ సర్పంచ్ మోకా రామారావు మాట్లాడుతూ గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించేందుకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శంకుస్థాపన చేసిన స్థలంలో కాకుండా మరోచోట నిర్మిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారని, దీనిపై వివరణ ఇవ్వాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నానాజీ స్పందించి స్థానిక ఇబ్బందుల కారణంగానే మరో చోట ట్యాంకు నిర్మాణానికి పూనుకున్నట్లుగా చెప్పారు.

రూ.22.86 కోట్లతో అంచనా బడ్జెట్ ఆమోదం

మండల పరిషత్ 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.22.86 కోట్ల అంచనా వార్షిక బడ్జెట్‌ను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. బడ్జెట్‌లో ప్రాథమిక విద్యకు ప్రభుత్వం నుంచి వచ్చే రూ.12.37 కోట్లు ఆదాయంగా, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం నుంచి రూ.9 కోట్లు ఆదాయంగా చూపిస్తూ వివిధ పనులకు ఆయా నిధుల్ని ఖర్చు చేయనున్నట్లుగా చూపించారు. సమావేశంలో జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, ఎంపీడీఓ ఏఎస్ శ్రీనివాస్, తహసీల్దార్ యడ్ల రాంబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ కార్యాలయాల వద్ద కాంగ్రెస్ ధర్నాలు



అమలాపురం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద ధర్నా చేస్తున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి, ఎల్‌ఐసీ బ్రాంచి కార్యాలయం వద్ద జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం వేర్వేరుగా ధర్నాలు జరిగాయి. ఎస్‌బీఐ, ఎల్‌ఐసీలకు సంబంధించిన నిధులు అదానీ గ్రూపునకు చెందిన కంపెనీల్లో పెట్టడం వల్ల డిపాజిట్లు చేసిన ఖాతాదారులు తీవ్రంగా నష్టపోతున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరావు ఆందోళన వ్యక్తం చేశారు. అదానీ యాజమాన్యానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బాబి, ఏపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ దేవరపల్లి రాజేంద్రప్రసాద్, నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి అయితాబత్తుల సుభాషిణి, పార్టీ రాష్ట్ర నాయకులు దోనిపాటి విజయలక్ష్మి, మాచర శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూచిమంచి రాంబాబు మృతి



కూచిమంచి రాంబాబు (ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన వితరణ శీలి కూచిమంచి వెంకట రామలింగేశ్వరశర్మ(రాంబాబు) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. అవివాహితుడైన 70 ఏళ్ల రాంబాబు యూకో బ్యాంక్‌లో ఉద్యోగి నుంచి చీఫ్ మేనేజర్ స్థాయిలో 36 ఏళ్లు పనిచేసి పదవీ విరమణ చేశారు. అమలాపురంలో సంస్కార భారతి, వాకర్స్ క్లబ్, లయన్స్ క్లబ్‌లకు అధ్యక్షుడిగానే కాకుండా వివిధ జిల్లా, జోన్ స్థాయి పదవుల్లో పనిచేశారు. అమలాపురం పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఇటీవల రూ.3 లక్షలు విరాళం అందించి పాఠశాల ప్రాంగణాన్ని చదును చేయించి బల్లలు, లాన్‌లు సమకూర్చారు. పేరూరు, గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏటా పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.10 వేల వంతున నగదు పురస్కారాలు అందిస్తున్నారు. రాంబాబు మృతిపై వివిధ సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

కేంద్రీయ విద్యాలయాన్ని నెలకొల్పాలి

యానాం: యానాంలో కేంద్రీయ విద్యాలయంతో పాటు మెడికల్ కళాశాలను నెలకొల్పాలని కోరుతూ సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత్ రైట్స్ ప్రొటెక్షన్ యూత్ అసోసియేషన్ నాయకులు పుదుచ్చేరి ఎంపీ వైద్యలింగంకు వినతిపత్రం అందజేశారు. భారతమాత విగ్రహం వద్ద గ్రంథాలయాన్ని నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కమిడి విజయకుమార్, అధ్యక్షుడు మెల్లం శ్రీనివాసరావు, గ్రామపెద్ద సబ్బతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు గ్రహీతకు సత్కారం

ఐ పోలవరం: మురమళ్ల ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న వి.రాజశ్రీ రిపబ్లిక్ వేడుకల్లో బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును తీసుకున్న సందర్భంగా ఆమెను సోమవారం సర్పంచ్ కాలే రాజబాబు అధ్యక్షతన పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాయపురెడ్డి మాణిక్యాలరావు, వార్డు సభ్యులు సవరపు వెంకటరమణ, ఎంపీటీసీ మట్టపర్తి శివ రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుని సంబరం



తాళ్లరేవులో వీరభద్రుడిని దర్శించుకుంటున్న భక్తులు



పెదగాడవిల్లిలో వీరభద్రుని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

తాళ్లరేవు: మండలంలోని పలు గ్రామాల్లో వీరభద్రుని సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. తాళ్లరేవు రోళ్లవారి వీధిలో స్వామివారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సుంకరపాలెంలో 51వ వీరభద్రుని సంబరాలను నిర్వహించారు. గౌతమి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. వీరముట్టుల నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో గ్రామంలో సందడి నెలకొంది. చొల్లంగి తుల్యభాగ నదిలో అనేక మంది పవిత్ర స్నానాలాచరించారు.

గ్రామాల్లో ఘనంగా వీరభద్రుని సంబరాలు

ఉప్పలగుప్తం: పవిత్ర మాఘమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పెదగాడవిల్లి, భీమనపల్లి, ఉప్పలగుప్తం, ఎన్.కొత్తపల్లి, చల్లపల్లి గ్రామాల్లో వీరభద్రుని సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు నదీ స్నానాలను ఆచరించి డప్పు వాయిద్యాలతో వీరభద్రునికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వీరభద్రునికి బోనాలు సమర్పించి అన్నసమారాధన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

జిప్‌మెర్‌లో సకల సౌకర్యాలు కల్పిస్తాం



జిప్‌మెర్ ఆసుపత్రి విభాగాలను పరిశీలిస్తున్న ఎంపీ వైద్యలింగం

యానాం: యానాంలో జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ అండ్ రీసెర్చ్(జిప్‌మెర్) మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో మెడికల్ ఎక్విప్‌మెంట్ ఉండేలా సహాయ సహకారాలు అందిస్తానని పుదుచ్చేరి ఎంపీ వైద్యలింగం పేర్కొన్నారు. సోమవారం ఆయన రూ.48.85 కోట్ల వ్యయంతో నిర్మించిన 100 పడకల జిప్‌మెర్ ఆసుపత్రి నూతన భవనాన్ని పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్లు, మెడికల్ గ్యాస్ ఎక్విప్‌మెంట్, ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ గదులు, లేబోరేటరీలు, ఎక్స్‌రే, అల్ట్రా స్కానింగ్, ఈసీజీ, బ్లడ్ బ్యాంక్ పరిశీలించి అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిప్‌మెర్ నిర్మాణం దాదాపు పూర్తి కావడంతో దాన్ని పరిశీలించేందుకు పుదుచ్చేరి నుంచి ముగ్గురు సభ్యుల వైద్యబృందం రానున్నారని ఎంపీ వైద్యలింగంకు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, సెంట్రల్ పీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.లక్ష్మయ్య, ఈఈ కృష్ణకిషోర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్, దున్నా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం కేసు

యానాం: వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ బడుగు కనకారావు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెద్దింశెట్టి రాజు అనే వ్యక్తికి యానాం పట్టణానికి చెందిన కొమ్మిరెడ్డి పరశురామ్ కొంత మొత్తాన్ని అప్పు ఇచ్చాడు. అయితే రాజు కొంత సొమ్మునే తిరిగివ్వడంతో మిగిలిన మొత్తం చెల్లించాలంటూ పరశురామ్ కోర్టును ఆశ్రయించాడు. దీంతో పరశురామ్ ఆదివారం రాత్రి స్థానిక రాజీవ్ బీచ్‌కు వెళుతుండగా రాజు చాకుతో దాడి చేసి పొడవబోయాడు. అడ్డుకున్న పరశురామ్ చేతులకు గాయాలయ్యాయి. నిందితుడు పెద్దింశెట్టి రాజుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని ఎస్‌ఐ కనకారావు తెలిపారు.

ఆక్వాజోన్‌లో చెరువుల నమోదు తప్పనిసరి



పటవలలో జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న ఫిషరీస్ ఏడీ కరుణాకరరావు

తాళ్లరేవు: రొయ్యలు, చేపలు సాగుచేసే రైతులు తమ చెరువులను ఆక్వాజోన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఫిషరీస్ ఏడీ కె.కరుణాకరరావు కోరారు. సోమవారం మండల పరిధిలోని చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, పటవల, కోరంగి పంచాయతీలలో ఆక్వా గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆక్వాజోన్‌కు సరిహద్దులో ఉండి విద్యుత్ వినియోగిస్తున్న వారందరూ తమ చెరువులను ఆక్వాజోన్‌లో చేర్చుకోవాలన్నారు. ఆక్వాజోన్‌లో లేని చెరువులకు రాయితీలు వర్తించవని, అలాగే భవిష్యత్‌లో సరుకు కొనుగోలు చేసే అవకాశం ఉండదని చెప్పారు. మండలంలో 520 ఎకరాల చెరువులను గుర్తించామన్నారు. పంచాయతీ తీర్మానం ద్వారా వాటిని ఆక్వాజోన్‌లో చేరుస్తామని చెప్పారు. పటవలలో జరిగిన గ్రామసభకు ఎంపీపీ రాయుడు సునీత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి అధిక మొత్తంలో విదేశీ మారక ద్రవ్యాన్ని తీసుకొచ్చే ఆక్వారంగం అభివృద్ధికి ప్రభుత్వం అనేక రాయితీలను అమలు చేస్తుందన్నారు. గ్రామసభల్లో ఎఫ్‌డీఓ గోపి, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, ఫిషరీస్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నడక నిత్యకృత్యం కావాలి



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జిల్లా వాకర్స్ గవర్నర్ భాస్కరరావు

అమలాపురం టౌన్: మనిషి జీవితంలో నడక అనేది నిత్యకృత్యం కావాలని వాకర్స్ జిల్లా గవర్నర్ ఎం.భాస్కరరావు పిలుపునిచ్చారు. ఇటీవల కొత్తగా స్థాపించిన సాయి సంజీవిని వాకర్స్ యోగా హెల్త్ సేవా సంఘం నూతన కార్యవర్గంతో స్థానిక సర్ సీవీ రామన్ స్కూలులో గవర్నర్ భాస్కరరావు ఆదివారం రాత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజును సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, అంతర్జాతీయ వాకర్స్ ఏరియా–1 కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, జిల్లా వాకర్స్ కార్యదర్శి ఆర్.సూర్యనారాయణ, సంఘం ఉపాధ్యక్షులు కొప్పిశెట్టి నాగేశ్వరరావు, రవణం వేణుగోపాలరావు, కార్యదర్శి నల్లా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనను విజయవంతం చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

అమలాపురం టౌన్: ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో నిర్వహిస్తున్న కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనను విజయవంతం చేయాలని సీఐటీయూ కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా సదస్సు తీర్మానించింది. స్థానిక ఎంప్లాయిస్ హోంలో సోమవారం జరిగిన సదస్సులో కార్మిక, కర్షక సమస్యలపై చర్చించి 12 డిమాండ్లను తెలియజేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.హరిబాబు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నూర్ మహ్మద్ ముఖ్య వక్తలుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షురాలు కుడుపూడి రాఘవమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుడి కుటుంబానికి నగదు అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు



విలసవిల్లిలో వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

తాళ్లరేవు: పోలేకుర్రు పంచాయతీకి చెందిన రాయుడు సింహాద్రి(42) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేల నగదును గ్రామ సర్పంచ్ వెంటపల్లి నూకరాజు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జ్యోతిసుధ, సచివాలయం కార్యదర్శి వినాయక్, నాయకులు ఎరికే వీరబాబు, పలివెల నాగేశ్వరరావు, సమ్మిడి వీర్రాజు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామానికి చెందిన దంగుడుబియ్యం సూర్యప్రకాష్ (45) ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించారు. అతడి భార్య బక్కీశ్వరికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా సర్పంచ్ ఊర్మిళాదేవి రూ.10 వేల రూపాయలను సోమవారం అందజేశారు. మిగతా సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కార్యదర్శి దాసరి కృష్ణాజీ, నల్లా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

చమురు సంస్థలు గ్రామాలను అభివృద్ధి చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: బావుల నుంచి ముడి పదార్థాన్ని తరలించుకుపోతున్న ఓఎన్జీసీ సంస్థలు గ్రామాలను అభివృద్ధి చేయాలని పలువురు తహసీల్దార్ జె.వెంకటేశ్వరికి సోమవారం వినతి పత్రం అందజేశారు. పేరాయిచెరువు, ఏటిమెరక, బడుగుపేట, మధురపేట గ్రామవాసులు తమ గ్రామాల్లో రోడ్లు, శ్మశాన వాటికలు, తాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని కోరారు.

ఫాగింగ్ యంత్రాల పంపిణీ



సర్పంచ్‌లకు యంత్రాలు అందజేస్తున్న ఎంపీపీ

అమలాపురం రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో జనుపల్లి, కామనగరువు, నడిపూడి, నల్లమిల్లి, పేరూరు, సాకుర్రు గ్రామపంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలను ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి చేతుల మీదుగా సర్పంచ్‌లకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దాసరి అరుణ, గుత్తుల చిరంజీవి రావు, గణాల భారతి, పంచాయతీ కార్యదర్శులు ఆర్.సూరపరాజు, రెడ్డి శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యానికి మేలు



పోటీలను ప్రారంభిస్తున్న తాలుకా ఎస్‌ఐ పరదేశి

అమలాపురం రూరల్: ఆటలతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తాలుకా ఎస్‌ఐ అందే పరదేశి అన్నారు. కామనగరువులో మాజీ సర్పంచ్ రాజులపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్‌ను తాలుకా ఎస్‌ఐ సోమవారం రాత్రి ప్రారంభించారు. పోటీల్లో 9 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కోనసీమ గౌడ సంఘం అధ్యక్షుడు రాజులపూడి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రాజులపూడి వెంకటేశ్వరరావు, నీటి సంఘం మాజీ డైరెక్టర్ కామన గంగాధరరావు, రాజులపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాయ్ నైపుణ్యమైన క్రీడాకారులను తయారుచేస్తుంది

పుదుచ్చేరి ఎంపీ వైద్యలింగం



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఎంపీ వైద్యలింగం

యానాం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిథ్యం వహించేలా నైపుణ్యమైన క్రీడాకారులను తయారు చేస్తుందని పుదుచ్చేరి ఎంపీ వి.వైద్యలింగం పేర్కొన్నారు. సోమవారం స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిట్ ఇండియా వారోత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ దేశంలోని 68 శాయ్ అకాడమీ కోచింగ్ సెంటర్లలో సగం అకాడమీలను మూసివేయాలని కేంద్రప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. అందుకే యానాం శాయ్ అకాడమీని కాపాడుకునేందుకు పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఎంపీ వైద్యలింగంను ఆయన కోరారు. అనంతరం కోచ్‌లు, పీఈటీలు, విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, శాయ్ అకాడమీ ఇన్‌ఛార్జి లింగేశ్వరరావు, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకర్, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అదానీ తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించాలి

పారిశ్రామికవేత్త అదానీ ప్రభుత్వ రంగ బ్యాంకుల వద్ద తీసుకున్న వేలాది కోట్ల రూపాయల అప్పులను తిరిగి చెల్లించాలని పుదుచ్చేరి ఎంపీ వైద్యలింగం డిమాండ్ చేశారు. సోమవారం యానాం స్టేట్ బ్యాంక్ శాఖ బ్రాంచ్ వద్ద అదానీ తీసుకున్న రుణాలను తిరిగి కట్టాలని డిమాండ్ చేస్తూ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ ఆర్థిక నేరాలకు బీజేపీ సహకరిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్, దున్నా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.